

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌యార్డులో కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

# ఓట్ల లెక్కింపునకు మూడంచెల భద్రత

- ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదు
- ఎస్పీ రాహుల్ హెగ్డే
- కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు పరిశీలన

సూర్యాపేట సిటీ, డిసెంబర్ 2 : జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. శనివారం బందోబస్తును పరిశీలించి మాట్లాడారు. మొత్తం 800 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా చేరవద్దని సూచించారు. ప్రజలు, రాజకీయ ప్రతినిధులు సహకరించాలని కోరారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు భద్రతా సిబ్బందికి చూపిస్తేనే కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశం ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్, లైటర్ల వంటి నిషేధిత వస్తువులను కౌంటింగ్ హాల్‌లోకి తీసుకెళ్లేందుకు అవకాశం లేదన్నారు. మూడు సెక్టార్స్‌లో మూడంచల భద్రత ఏర్పాటు చేసినట్లు, 12 సెక్షన్లలో పారా మిలటరీ సిబ్బంది, 50 మంది స్టేట్ ఆర్మ్‌డ్ సిబ్బంది, అడిషనల్ ఎస్పీ 1, డీఎస్పీ 4, సీఐలు 14, ఎస్‌ఐలు 40, ఏఎస్‌ఐ, హెచ్‌సీ, పీసీ, హెచ్‌జీ సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదని, బాణాసంచా, డీజేలను నిషేదించినట్లు పేర్కొన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగభూషణం, రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, పట్టణ సీఐ రాజశేఖర్, రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, ఆర్ఐ నారాయణ ఉన్నారు.



కళా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

## 16 నుంచి ఏపీలో ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు

- మనమ్ వికాస్ వేదిక అధ్యక్షుడు గణేశ్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 2 : కళా వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో గల బుద్దాల కన్వెన్షన్‌లో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలను విజయవంతం చేయాలని మనమ్ వికాస్ వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేశ్ కోరారు. శనివారం స్థానిక సుధా బ్యాంక్ ఆడిటోరియంలో కళా ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కళాకారులను ప్రోత్సహించేందుకు కళా వేదిక ఆధ్వర్యంలో 30గంటల 30నిమిషాల 30సెకన్ల పాటు నాన్‌స్టాప్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, అంతర్జాతీయ చైర్మన్ కత్తిముండ ప్రతాప్ నిర్వహించే వివిధ రకాల కళా ప్రదర్శనలను కళాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళా వేదిక అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి, కవి హమీద్‌ఖాన్, కార్టూనిస్టులు పల్లె మణిబాబు, శిరంశెట్టి ఆనంద్, దైద వెంకన్న, ఉపేంద్రచారి పాల్గొన్నారు.

## అధిక సాంద్రత పత్తి సాగుపై అవగాహన



వర్ధమానుకోటలో మాట్లాడుతున్న కేవీకే ఇన్‌చార్జి నరేశ్

నాగారం, డిసెంబర్ 2 : కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి ఆధ్వర్యంలో శనివారం నాగారం మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.కేవీకే ఇన్‌చార్జి ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ డి.నరేశ్, కేవీకే సస్య రక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్ మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తి సాగులో చేపట్టాల్సిన మెళకువలు, యాంత్రీకరణ పద్ధతుల గురించి తెలిపారు. ఎరువుల యాజమాన్యం, చీడ పీడల నివారణ, సస్య రక్షణ చర్యలు, లింగాకర్షక బుట్టల వినియోగం, జిగురు అట్టలు వాడే విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాశీ సీడ్స్ ప్రాజెక్ట్ ఆఫీసర్ టి.నరేశ్, విక్రమ్, సంతోశ్, మౌనిక పాల్గొన్నారు.

# సోలిపేట టూ నారాయణప్పగూడెం

- సూర్యాపేట నియోజక వర్గంలో 271 పోలింగ్ కేంద్రాలు.. 20 రౌండ్లు
- ఒక రౌండ్‌కు 14 టేబుళ్లు
- 2,06,977 ఓట్లు లెక్కింపు
- సాయంత్రం 4 గంటలకు ఫలితంపై స్పష్టత



సూర్యాపేట మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

సూర్యాపేట, డిసెంబర్ 2 : సూర్యాపేట అసెంబ్లీ నియోజక వర్గ ఎన్నికల ఫలితాల కోసం కౌంటింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించనున్నారు. నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో నియోజక వర్గం వ్యాప్తంగా 271 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,41,799 మంది ఓటర్లుకు గాను 2,03,624 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారికి తోడు 3,353 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. మొత్తంగా 2,06,977 ఓట్లను అధికారులు లెక్కించనున్నారు. 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. రౌండ్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. లెక్కింపు మాత్రం సూర్యాపేట మండలం సోలిపేట గ్రామం నుంచి ప్రారంభం కానున్నది. మధ్యాహ్నం 4 గంటల వరకు ఫలితంపై స్పష్టం రానున్నది. ఎన్నికల బరిలో ఉన్న 20 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది.

### ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం..

ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్నది. మొదటగా పోస్టల్ ఓట్లను లెక్కించనున్నారు. నియోజక వర్గం వ్యాప్తంగా 3,353 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. వాటి కోసం 6 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం ఉదయం 8.30 గంటలకు ఈవీఎంలను తెరిచి లెక్కింపు చేపట్టనున్నారు.

### సోలిపేట నుంచి మొదలు..

సూర్యాపేట నియోజక వర్గం ఓట్ల లెక్కింపు సూర్యాపేట రూరల్ మండలం సోలిపేట నుంచి ప్రారంభం కానున్నది. రూరల్ మండలంలో 47 పోలింగ్ కేంద్రాలు ఉండగా తొలత 1 నుంచి 32 పోలింగ్ కేంద్రాల లెక్కింపు రూరల్ మండలంలో జరుగనున్నది. ఆనంతరం సూర్యాపేట పట్టణంలోకి ప్రవేశం కానున్నది. 33వ పోలింగ్ కేంద్రం నుంచి 117వ పోలింగ్ కేంద్రం వరకు పట్టణ ఓట్లు లెక్కించనున్నారు. ఆ తర్వాత రూరల్ మండలంలోని 133వ పోలింగ్ కేంద్రం వరకు ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం పెన్‌పహాడ్ మండల ఓట్లు లెక్కింపు చేపట్టనున్నారు. ఈ మండలంలో 40 పోలింగ్ కేంద్రాలు ఉండగా అవి 134–173 వరకు ఉన్నాయి. పెన్‌పహాడ్ తర్వాత చివ్వెంల మండల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ మండలంలో 47 పోలింగ్ కేంద్రాలు ఉండగా అవి 174–220 వరకు ఉన్నాయి. చివరగా ఆత్మకూర్ (ఎస్) మండలం ఓట్లు లెక్కించనున్నారు. ఈ మండలంలో 51 పోలింగ్ కేంద్రాలు ఉండగా అవి 221 నుంచి 271 వరకు ఉన్నాయి. చివరగా నారాయణప్పగూడెంలోని ఓట్లను లెక్కించడం జరుగుతుంది. అప్పటికే ఫలితం తేలనున్నది.

### సాయంత్రానికి స్పష్టమైన ఫలితాలు..

నియోజక వర్గంలో 271 పోలింగ్ కేంద్రాలు ఉండగా 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. సూర్యాపేట మండలం, రూరల్ కలిపి 133 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో 10 రౌండ్లలో 98,553 ఓట్లు లెక్కించనున్నారు. దాదాపు సగం ఓట్ల లెక్కింపు పూర్తి కానున్నది. పెన్‌పహాడ్ మండలం 3 రౌండ్లు, చివ్వెంల 3 రౌండ్లు, ఆత్మకూర్.ఎస్ 4 రౌండ్లలో ఓట్లు లెక్కించనున్నారు.

# మోత్కూరు ఫస్ట్ తిరుమలగిరి లాస్ట్

- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- తుంగతుర్తి నియోజక వర్గంలో పోలింగ్ కేంద్రాలు 326
- ఓట్ల లెక్కింపు 14 బూత్‌లకు కలిపి 1 రౌండ్
- మొత్తం 19 రౌండ్లు లెక్కింపు
- మొదటగా మోత్కూర్, చివరగా తిరుమలగిరి లెక్కింపు

తిరుమలగిరి, డిసెంబర్ 2 : నవంబర్ 30న రాష్ట్ర శాసన సభకు జరిగిన ఎన్నికల ఫలితాలు ఆదివారం వెల్లడి కానున్నాయి. తుంగతుర్తి నియోజక వర్గం బరిలో నిలిచిన 14 మంది అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనున్నది. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో జరిగే ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్నది. 14 బూత్‌లకు 1 రౌండ్‌గా లెక్కిస్తారు. నియోజక వర్గంలో మొత్తం 326 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. సుమారు 22 రౌండ్ల లెక్కింపు జరుగనున్నది. వరుస క్రమంలో మొదటగా మోత్కూర్, అడ్డగూడూరు, శాలిగౌరారం, జాజిరెడ్డిగూడెం, నూతనకల్, మద్దిరాల, తుంగతుర్తి, నాగారం, చివరగా తిరుమలగిరి ఓట్లు లెక్కించడం జరుగుతుంది. నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 2,55,017 మంది ఉండగా 2,23,163 ఓట్లు పోలయ్యాయి. వాటిలో పురుషులు 1,13,229 మంది కాగా మహిళా ఓట్లు 1,09,932. పోస్టల్ బ్యాలెట్ 1,730 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా 87.51 శాతం పోలింగ్ నమోదైంది.

**నియోజక వర్గంలో మండలాల వారీగా నమోదైన ఓట్లు, పోలింగ్ బూత్‌లు, లెక్కింపు రౌండ్లు ఇలా ఉన్నాయి**

| మండలం పేరు | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | పోలింగ్ స్టేషన్లు | మొత్తం పోలింగ్ బూత్‌లు | లెక్కింపు రౌండ్‌లు |
|---|---|---|---|---|---|
| మోత్కూర్ | 26,953 | 22,881 | 01– 31 | 31 | 02 |
| అడ్డగూడూరు | 22,631 | 20,036 | 32–60 | 30 | 02 |
| శాలీగౌరారం | 39,386 | 34,239 | 62–113 | 52 | 04 |
| జాజిరెడ్డి గూడెం | 23,826 | 21,348 | 114–145 | 32 | 02 |
| నూతనకల్ | 28,135 | 24,675 | 146–180 | 35 | 02 |
| మద్దిరాల | 24,665 | 21,582 | 181–211 | 31 | 02 |
| తుంగతుర్తి | 33,397 | 28,990 | 212–257 | 46 | 03 |
| నాగారం | 23,691 | 20,631 | 258–286 | 29 | 02 |
| తిరుమలగిరి | 32,333 | 28,781 | 287–326 | 40 | 03 |

## గర్భిణులు టీకాలు తీసుకోవాలి

నూతనకల్, డిసెంబర్ 2 : గర్భిణులు క్రమ తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా టీకాలు వేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహలను నిర్మూలించాలి

- ఎంవీఎఫ్ మండల ఇన్‌చార్జి రవికుమార్

నూతనకల్, డిసెంబర్ 2 : గ్రామీణ ప్రాంతాల్లో నేటికి కొనసాగుతున్న బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంవీఎఫ్ మండల ఇన్‌చార్జి చిప్పెలపల్లి రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని గుగులోతుతండాలో కిశోర్‌బాలికలకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే పెండ్లిండ్లు చేస్తే బాలికలు అనేక ఇబ్బందులకు గురవుతారన్నారు. బాలికలకు 18 ఏండ్లు, బాలురకు 21ఏండ్లు వచ్చే వరకు వివాహం చేయకూడదని తెలిపారు. బాల్య వివాహాలు జరిగితే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## రేపు కంటి వైద్య శిబిరం

బొడ్రాయిబజార్, డిసెంబర్ 2 : రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో ఈ 4న సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎస్.నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాక్సీ శరత్ లేజర్ కంటి ఆస్పత్రి వరంగల్ వారిచే ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగనున్నట్లు వెల్లడించారు. విశ్రాంత ఉద్యోగులు తమ హెల్త్ కార్డును వెంట తీసుకు రావాలని సూచించారు.